
అచ్చంపేట భ్రమరాంబ దేవాలయంలో..


కొల్లాపూర్ వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో


పెద్దకొత్తపల్లి మండలం దేవల్‌తిరుమలాపూర్‌లో..


కల్వకుర్తిలో రాజరాజేశ్వరిగా వాసవీమాత

# జగన్మాత.. నమోస్తుతే

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నాల్గోరోజు ఆదివారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాన్ని సమర్పించారు. అచ్చంపేట, తెలకపల్లి, లింగాల, పెద్దకొత్తపల్లి, మన్ననూరులో లలితాత్రిపురసుందరిదేవిగా, కొల్లాపూర్ వాసవీకన్యకాపరమేశ్వరీ దేవాలయంతో పాటు పెంట్లవెల్లిలో శాకంబరిమాతగా, వరిదేల శమీవృక్షం వద్ద అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. కల్వకుర్తి పట్టణంలోని పలు దుర్గాదేవి మండపాలను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు పల్లోజు ఆచారి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పెంట్లవెల్లిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.


లింగాలలో అమ్మవారిని దర్శించుకుంటున్న చిన్నారులు, మహిళలు


మన్ననూర్ వేణుగోపాలస్వామి ఆలయంలో


పెంట్లవెల్లిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు


పెంట్లవెల్లి మండలం గోవిందాయిపల్లిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు


కల్వకుర్తి వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో మాట్లాడుతున్న ఆచారి


తెలకపల్లిలో లలితాదేవిగా

## క్లుప్తంగా

### చెక్‌పోస్టులను ఎత్తేయాలి

అచ్చంపేట రూరల్: హిందూ దేవాలయాలైన ఉమామహేశ్వరం, మద్దిమడుగు దేవాలయాలకు వెళ్లే దారిలో ఉన్న ఫారెస్టు చెక్‌పోస్టులను వెంటనే ఎత్తేయాలని శివసేన రాష్ట్ర అధ్యక్షుడు సింకారు శివాజీ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉమామహేశ్వరం దేవాలయ సందర్శనకు వస్తున్న రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వస్తున్న సందర్భంగా హిందువుల మనోభావాలను గౌరవించి అక్రమ చెక్‌పోస్టులను ఎత్తి వేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### కేఎల్ఐ నీరు విడుదల



కల్వకుర్తిరూరల్: రైతులు వేరుశనగ, ఇతర పంటలకు భూములను దున్ని సిద్ధం చేసుకున్నారు. కేఎల్ఐ కాల్వ పరివాహక ప్రాంత రైతులు కేఎల్ఐ నీటి కోసం ఎదురుచూస్తున్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు పంటలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఎట్టకేలకు 40 రోజుల తరువాత నీరు విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. దీంతో ఆయకట్టు రైతులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

### కేసు నమోదులో జాప్యం తగదు

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): వెల్గొండ గ్రామానికి చెందిన దళిత మహిళపై అత్యాచారయత్నం జరిగినట్లు బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు నిందితులను రక్షించేందుకు కేసు నమోదు చేయడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఈర్ల చంద్రమోళి ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. శుక్రవారం బాధితురాలు ఫిర్యాదు చేసినా రెండు రోజులుగా కేసు నమోదు చేయకపోవడంతో అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. బాధిత మహిళకు న్యాయం చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

### ధర్మసమాజ్ పార్టీ మండల కమిటీ ఎన్నిక



చారకొండ: ధర్మసమాజ్ పార్టీ మండల నూతన కమిటీని ఆదివారం ఏగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ నాయకులు సమావేశం అయ్యారు. సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయి మహరాజ్ హాజరై కమిటీని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చంద్రశేఖర్ మహరాజ్, ఉపాధ్యక్షుడిగా వెంకటేష్, కార్యదర్శిగా మల్లేష్, కోశాధికారిగా నాగార్జున సభ్యులు కొండల్ ఉదయ్, గణేష్, మహేష్, అయోధ్య, మొగులయ్య తదితర సభ్యులు ఎన్నికయ్యారు. జిల్లా నాయకులు సురేష్,తదితరులు ఉన్నారు.

### 'శివగాడు యమస్పీడ్' షూటింగ్ ప్రారంభం



కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిలలోని సోమేశ్వరాలయ ఆవరణలో శివగాడు యమస్పీడ్ మూవీ షూటింగ్‌ను ఆదివారం మున్సిపల్ చైర్ పర్సన్ మేకల రమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకల నాగరాజు, కౌన్సిలర్ రహీం నటినటులు పాల్గొన్నారు.

### మినీ కాజ్‌వే నిర్మించాలి

బల్మూర్: మండల కేంద్రం నుంచి వీరంరాజ్‌పల్లి గ్రామానికి వెళ్లే రహదారిలోని కల్వర్టు వద్ద వర్షం పడిందంటే చాలు వాగు నీటి ప్రవాహంతో వాహనాల రాకపోకలు నిలిచి మూడు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి నుంచి మండల కేంద్రానికి నిత్యం రామాజిపల్లి, వీరంరాజ్‌పల్లి, చెన్నారం గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ పనుల నిమిత్తం, ఇతర గ్రామాలకు వెళ్లేందుకు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షకాలంలో కల్వర్టు ద్వారా వాగు నీరు ప్రవహించడంతో దాటలేని పరిస్థితి ఏర్పడుతోంది. నెల రోజులుగా కురుస్తున్న వర్షంతో చిన్నపల్లె చెరువు, మైలారం చెరువులు నిండి అలుగు పారుతుండటంతో కల్వర్టు వద్ద నీటి ఉధృతికి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కొండనాగుల మీదుగా మండల కేంద్రానికి చేరుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి మినీ కాజ్‌వే నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# పట్టణ అభివృద్ధికి కృషి

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డా రాజేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 12వ వార్డులో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడుతానన్నారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మోతికుమార్, రాధాకృష్ణ, హబీబ్, ఇంతియాజ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

### మెరుగైన వైద్య సేవలు అందించాలి

కల్వకుర్తి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం పట్టణంలో ఎన్నం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఓపీ సేవలను వారు ప్రారంభించారు. ప్రజలకు వైద్య సేవలు అందించి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు డాక్టర్ హరికాంత్‌రెడ్డి, రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ మెంబర్ బాలాజీ సింగ్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ నాయకులు పాల్గొన్నారు.

# బురదమయంగా మట్టి రోడ్డు

తాడూరు: మండలంలోని చర్లతిరుమలాపురం నుంచి చర్లిటిక్యాల, తుమ్మలసూర్‌కు వెళ్లే లింక్ రోడ్డు బురదమయంగా మారి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బందలు పడతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు రోడ్డును పరిశీలించి మరమ్మతు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


బురదమయంగా తిరుమలాపూర్ లింక్‌రోడ్డు

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పెంట్లవెల్లిలో గురువులను సన్మానిస్తున్న జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు

వెల్దండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–1996లో పదోతరగతికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని ఆకృతి గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గురువులు వెంకట్‌రెడ్డి, నరసింహ్మరెడ్డి, జంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రఘురాములు, గోసుల రాములు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని శ్రీవాణి విద్యానిలయం 2004–05లో పదోతరగతికి చెందిన పూర్వ విద్యార్థులు పట్టణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులను సన్మానించారు. సామూహిక సహపంక్తిభోజనాలు చేశారు.

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2012–13వ సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. రిటైర్డ్ జీహెచ్ఎం సురేందర్‌రెడ్డితో పాటు చంద్రమౌళి, వెంకట్రాజు, శేఖర్, అశోక్, శ్రీను, జంగయ్య, నీలాబాయి, అహ్మద్ తదితరులను సన్మానించారు. కరోనా కాలంలో భర్తను కోల్పోయిన స్నేహితురాలు మంజులకు అప్పటి ఉపాధ్యాయులు రూ.20 వేల ఆర్థికసాయం చేశారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రలోనిని జెడ్పీహెచ్ఎస్ బాలుర హైస్కూల్‌లో 1997–98 బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువులను సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు.


నాగర్‌కర్నూల్‌లో..

### నేడు చేప విత్తనాల పంపిణీ

నాగర్‌కర్నూల్‌రూరల్: మత్స్యశాఖ నాగర్‌కర్నూల్ జిల్లా ఆధ్వర్యంలో సోమవారం శ్రీవారి సముద్రం రిజర్వాయర్(సింగోటం) వద్ద ఉదయం 9 గంటలకు చేప విత్తనాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని జిల్లా మత్స్య సహకార సంఘం మేనేజింగ్ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం పాలెం పెంటోని చెరువు వద్ద చేప విత్తనాలను విడుదల చేయనున్నట్లు వారు తెలిపారు.

### అస్తవ్యస్తంగా గ్రంథాలయ నిర్వహణ




లింగాల: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయానికి కొన్నేళ్లుగా లైబ్రేరియన్ లేక పోవడంతో గ్రంథాలయం నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని పాఠకులు ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు, విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్‌గా నియామకం అయిన అచ్చంపేట ప్రాంతానికి చెందిన అడ్వకేట్ రాజేందర్ గ్రంథాలయ అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. ఖాళీగా ఉన్న వివిధ పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

కొల్లాపూర్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కాంగ్రెస్ నాయకుడు బిజ్జ దశరథం కుటుంబాన్ని ఆదివారం పలువురు నాయకులు పరామర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు హన్మంతునాయక్, మేకల నాగరాజు, ఎక్బాల్, బీఆర్ఎస్ నాయకులు నరేందర్‌రెడ్డి, కాటం జంబులయ్య, కట్టా శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ గాదెల సుధారాణి, కోఆప్షన్ సభ్యులు రుక్మద్దీన్, జూపల్లి నాగేంద్రం ఉన్నారు. ముదిరాజ్ సంఘం నాయకులు జూపల్లి రవీందర్ రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.

### 9న కాన్షీరాం వర్ధంతి సభ

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 9న కాన్షీరాం వర్ధంతి సభ నిర్వహిస్తునట్లు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అంతటి నాగన్న, పృథ్వీరాజ్, కొత్తపల్లి కుమార్, కల్యాణ్, రాంచందర్, నాగేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నాళ్లీ కష్టాలు?

- వానొస్తే రాకపోకలు బంద్

కల్వకుర్తి రూరల్: పాలకులు ఎన్నికల సందర్భంలో బ్రిడ్జి నిర్మిస్తాం, సమస్య తీరుస్తామని ప్రకటిస్తున్నప్పటికీ చేతల్లో అమలు కావడంలేదు. మండలంలోని రఘుపతిపేట–రామగిరి మధ్య బ్రిడ్జి నిర్మాణం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దుందుభీ నది ఉప్పొంగితే రాకపోకలు నిలిచిపోతున్నాయి. 20 రోజులుగా వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఎక్కడికక్కడ రాకపోకలు ఆగిపోయాయి. చుట్టూ తిరగలేక రఘుపతిపేట నుంచి రామగిరి, నడిగడ్డ, తెలకపల్లి తదితర ప్రాంతాలకు నాగర్‌కర్నూల్ మీదుగా వెళ్లాల్సి వస్తోంది. దూరభారం కావడంతో చాలా మంది ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వాగు ప్రవాహంలో రాకపోకలు సాగిస్తున్నారు. చుట్టు పక్కల వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులు, చదువుకునే విద్యార్థులు, ప్రైవేట్ వాహనదారులు అందులోనే ప్రయాణిస్తున్నారు. సంవత్సరం క్రితం వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.45 కోట్లు మంజూరుకావడంతో భూమి పూజ చేశారు. సంవత్సరం కావస్తున్నా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. గతంలో వాగు ప్రవాహంలో ట్రాక్టర్, ఆర్టీసీ బస్సు కొట్టుకుపోయి ప్రయాణికుల ప్రాణాలు నీటిలో తేలియాడాయి. దాదాపు 2 నెలల పాటు దుందుభీ ప్రవాహంతో వాహనాల రాకపోకలు నిలిచిపోవడం, చుట్టూ తిరిగి ప్రయాణం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల ప్రాణాలు పోతేనే స్పందిస్తారా? అనే ప్రశ్నలు వెలువడుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణం చేపట్టి వెంటనే సమస్యను పరిష్కరించాలని రఘుపతిపేట, రామగిరి, తెలకపల్లి తదితర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


వాగు ప్రవాహంలో వెళ్తున్న స్థానికులు

### నిరుపయోగంగా గ్రామీణ పశువైద్యకేంద్రం



పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాములలో రూ.12 లక్షలతో గ్రామీణ పశువైద్య కేంద్రాన్ని నిర్మించారు. వైద్యులను నియమించకపోవడంతో కేంద్రం మూతపడింది. దీంతో గ్రామంలో గొర్రెలు, మేకలు, పశువులకు రోగాల బారిన పడితే వైద్యం చేసేవారు లేక కాపరులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశు వైద్య కేంద్రానికి వైద్యులను నియమించి వైద్య సేవలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ప్రహరీ నిర్మించండి



వీపనగండ్ల: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌కు ప్రహరీ నిర్మాణం చేపట్టకపోవడంతో విద్యుత్ ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల రైతులకు అవసరమయ్యే ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్‌వైర్, ఫ్యూజ్‌వైర్లతో పాటు పలు రకాల విలువైన వస్తువులు సబ్‌స్టేషన్ ఆవరణలో ఉన్నాయి. వాటికి రక్షణ గోడ లేకపోవడంతో రాత్రి వేళల్లో ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని విద్యుత్ ఉద్యోగులు పేర్కొంటున్నారు ప్రహరీ నిర్మించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

### ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి




నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ప్రైవేట్, పబ్లిక్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పొదిల రామయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో రవాణా రంగ కార్మికుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్మికులు ఆర్థికంగా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు రూ.12 వేల జీవనభృతిని చెల్లించాలన్నారు. ఆటో కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం సొప్పకట్ల పాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పాపారావు ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆటో ఫైనాన్స్ కిస్తులు కట్టలేక ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తుచేశారు. రాష్ట్రంలో 50 లక్షల మంది ఆటో, రవాణా రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్నారని వివరించారు. కార్మికులు మరణిస్తే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి, శివయ్య, బాలస్వామి, రామచంద్రం, సుభాష్, బాబా, భాస్కర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆటో సీజ్: కేసు నమోదు

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): వెల్గొండ గేటు సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 17 సంచుల పీడీఎస్ బియ్యాన్ని బిజినేపల్లి పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ నాగశేఖరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వెల్గొండ గ్రామానికి చెందిన భాస్కర్ ఆదివారం ఆటోలో 17 సంచులలో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారు. అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అనుమానంతో ఆటోను తనిఖీ చేశారు. అందులో పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్టేషన్‌కు తరలించారు. ఆటోను సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### దుస్తుల పంపిణీ



కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్‌లో ఆదివారం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు గ్రామానికి చెందిన తాళ్ల సురేష్‌గౌడ్ క్రీడా దుస్తులను అందజేశారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో దేవయ్య, మాణిక్యరావు, రమేష్, రవి, మహేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

### స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పాన్‌గల్: మండలంలోని రేమద్దులకు చెందిన కుర్మయ్య కుటుంబానికి తమ వంతు సాయంగా 2000–2001 పదో తరగతి మిత్రులు రూ.50 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలల క్రితం కుర్మయ్య అనారోగ్యంతో మృతి చెందాడని, దీంతో బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు గురుకుల పాఠశాల లింగాలలో చదువుకున్న తోటి మిత్ర బృందం హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ద్వారా పోగు చేసిన నగదును కుటుంబానికి అందజేసినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మిత్ర బృందం భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో శాలయ్య, కుమార్, శ్రీబాబు, గిరిబాబు, సహదేవ్, రాజేందర్, తిరుపతయ్య పాల్గొన్నారు.

